అనార్కలి

చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు

అనార్కలి యనఁగా దానిమ్మపువ్వు. ఆపేరుగలమహమ్మదీయస్త్రీ యొకతె రమారమి మూఁడువందల సంవత్సరముల క్రిందట డిల్లీచక్రవర్తియైన యక్బరుయొక్క రాణివాసమునం దుండెను. అక్బరుయొక్క యంతఃపురమునందు నించుమించుగ నైదువేలమంది చక్కనియువిద లుండిరని చరిత్రకారులు చెప్పెదరు. అందుఁ గొందఱు చక్రవర్తిభార్యలు; కొందఱుంపుడుకత్తెలు; కొందఱు దాసీస్త్రీలు. చక్రవర్తి వారి కందఱకు వారివారి చక్కఁదనమునుబట్టి, సౌకుమార్యమునుబట్టి, లావణ్యమునుబట్టి, లాలిత్యమునుబట్టి, విలాసమునుబట్టి, విన్నాణమును బట్టి, జీతము లిచ్చుచుండును. అనార్కలి యొక దాసీపుత్రియయ్యుఁ జక్కని చుక్క. మొగలాయీల యంతఃపురమందలి యంగనలలో ననార్కలికి సౌందర్యమున సాటి వచ్చులావణ్యవతు లొకరో యిద్దఱో యుండిన నుందురేమోగాని తక్కినవా రామెయెదుట దివిటీముందఱి దీపములు. చంద్రమండలముముందఱి నక్షత్రములు. బాల్యకాలమున నామెతల్లి చనిపోయెను. కాని యామెయందమునుబట్టి యామెయందు గాఢానురాగము గలిగి యంతఃపురకాంత లామె నరచేతి నిమ్మపండువలెఁ బెంచిరి. మొగ్గ పువ్వుగాక మానునా? పుష్పము వికసింపకయుండునా? వికసించిన వెనుక నెత్తావులు నలుగడల వ్యాపింపకుండునా? వ్యాపించినపిదపఁ దుమ్మెదలు జుమ్మని క్రమ్మకుండునా? చిన్నబిడ్డయైన యనార్కలి శుక్లపక్షచంద్రబింబమువలెఁ గ్రమక్రమముగ వృద్ధిఁబొంది నిండుజవ్వని యయ్యెను. ముఖారవిందము ముద్దులు మూటగట్టుచుండెను. చూపులయందు సొగసు నెలకొనెను. మాటలలో మాధుర్య ముత్పన్నమయ్యెను. చిఱునవ్వులు శృంగారభూయిష్ఠము లయ్యెను. నడకలలో నవవిలాసంబులు కుదురుకొనెను. అంతఃపురమందలి యంగనలు సయితము దానిచక్కఁదనమును జూచి "వహ్వారే! వహవా" యని మెచ్చుచుండఁ బురుషులమాట వేఱ చెప్పనేల? అక్బరుచక్రవర్తి చండశాసనుఁడగుటచే నతనికి జంకి యంతఃపురమందలిపురుషు లనేకులు దానిం జూడక యోసరిల్లి పోవుచుండిరి. కాని భయంకరశాసనుఁడైన చక్రవర్తికి సయితము నప్పుడప్పుడు జంకనియాత్మ యొకటి మొగలాయీ రాణివాసములో నుండెను. ఆయాత్మ యెవ్వరందురా? అక్బరుచక్రవర్తికుమారుఁడు. ఆతని పేరు నూరుద్దీను సలీము. ఇతఁడు కొన్నివిషయములలో స్వాతంత్రుఁడు. కొన్నియంశములలో సాహసుఁడు. కొన్నియెడల దుండగీఁడు. అనార్కలిని రాజకుమారుఁడైన సలీము పలుమా రంతఃపురమందుఁ జూచెను.

ఆమెమీఁదఁ గన్నుపడినతోడనే మనస్సు కూడఁ బడెను. మనోహృదయములు రెండును ననార్కాలిమీఁద నిలిచెను. చూచినదిమొదలుకొని యామెను బలుకరింపవలయునని యుండెను. ఏదో సందుచేసికొని యతఁడప్పుడప్పుడు పలుకరించెను. పలుకరించినదిమొదలుకొని స్వేచ్ఛగా దానితో విహరింపవలయునని బుద్ధి పుట్టెను. కాని యనార్కాలి పంజరములోని చిలుకవలె నిరంతర మంతఃపురమందే యుండుటచేత సలీమునకు దానింగలిసికొనుట కవకాశము చిక్కినదికాదు. అటులుండ నొకనాఁడాబాలిక సాయంకాలసమయమున జలకమాడి సన్నపట్టువలువలుఁదాల్చి మన్మథునిమోహనాస్త్రమో యనున ట్లంతఃపురోద్యానవిహారము సేయుటకై వెళ్లెను. వెళ్లి యిందందుఁగొంచెము సేపు తిరిగి పుష్పసౌరభము నాఘ్రాణించి మలయమారుతస్పర్శసుఖము ననుభవించి యేమేమో యాలోచించుకొనుచు నొకచో నిలిచి యుండెను. అపుడు వెనుకపాటున నెవ్వరో వచ్చి యామెను బిగియారఁ గౌఁగిలించుకొనిరి. అదరిపడి తత్తరపాటున నామె వెనుకకుఁ జూచునప్పటికిఁ జక్రవర్తికుమారుఁడైన సలీము కానఁబడియెను. అంతట నామె తత్తరపాటు హెచ్చెను. బిగికౌఁగిలి విడిపించుకొనుటకై యామె కొంత ప్రయత్నముఁ జేసెను. కాని సలీముయొక్క దీర్ఘబాహువులు పట్టు విడువవయ్యెను. అతని బాహువులపటిమకంటెఁ బ్రేమపాశములపటిమ యధికమై శరీరమును విడువకుండఁ జేసెను. "ప్రియురాల! నీవు తప్పించుకొనిపోవకుము. నీవు నాదానవు. చిరకాలమునుండి నిన్నుఁ గలిసికొనుటకే నేను ప్రయత్నము సేయుచుంటిని. చిక్కిన యవకాశముఁ జెడఁగొట్టకు" మని తనివిదీరఁ గౌఁగిలించి ముఖారవిందము ముద్దిడుకొని మరల నేమేమొ యనఁబోవుచుండ నెవరో వచ్చినట్లయ్యెను. సమాగమము విఘ్నమయ్యెను. కార్యసిద్ధి కంతరాయము లనేకములు. విఘ్నములు వేనవేలు.

అంతట నిద్దఱు చెరియొకప్రక్కకుఁ జనిరి. ఎవరిస్థానము వారు ప్రవేశించిరి. చెరియొకచోట వారుండినను హృదయము లొకచోటనే యుండెను. మనసులు మాటలాడుకొనుచుండెను. కేవలశరీరములతోఁ గాకపోయినను స్వప్నములలో నాలింగనములు తఱుచు జరుగుచుండెను. స్వప్న సమాగమములవల్ల గలిగిన యానంద మెంతో మేలుకొన్న తరువాతఁ గలిగిన యుత్సాహ భంగమంత. ఇటులుండఁగా నక్బరుచక్రవర్తి లాహోరుపట్టణమునకు వెళ్లెను. అతనితో నంతఃపురమంతయు వెళ్లెను. అంతఃపురమే కాదు; ఢిల్లీనగరమంతయు వెళ్లెనని చెప్పవచ్చును. లాహోరునగరమునందుండఁగా నొకనాఁడు చక్రవర్తి నృత్యగానములచే వినోదింప వలయునని తలంచెను. ధరణీనాయకులు తలంచుటే తడవు గదా! సంకల్పమాత్రముచేతనే సకలకార్యములు వారికి సిద్ధించును. అంతఃపురమందలి స్త్రీలలో నాట్యమునందుఁ బ్రజ్ఞకలవారందఱిని రావించి చక్రవర్తి నాఁటిరాత్రి గజ్జెకట్టించెను. కొందఱు ముందుగ నృత్యముచేసి నాఁ డక్కడఁజేరిన యంతఃపురస్త్రీలకును దక్కిన రాజబంధుగులకును నానందమును గలి

గించిరి. అనార్కాలియు నృత్యవిద్యయందు నిరుపమాన ప్రావీణ్యము గలదగుటచేఁ గట్టకడపట నామెవంతు వచ్చెను. వెండిబంగారపు దీపస్తంభములలో నత్తరుదీపములు వెలుఁగుచుండెను. దీపకాంతికంటె నెక్కుడుకాంతి గలిగి యనార్కాలి వెలయుచుండెను. నగలు దాల్పవలసినయావశ్యకత లేదుగాని జిలుఁగుబుటేదారుపనిచేసినదువ్వలువ లామెశరీరమున కందము నిచ్చుచున్నవని చెప్పుటకంటె నామె శరీరసంపర్కమువలన నెక్కువ శోభావంతములై యవియే మెఱయుచుండెనని చెప్పుట సత్యమునకు సమీపము. ఆదీపములనడుమ దాని మొగము నక్షత్రములనడుమ చంద్రమండలమువలె శోభిల్లుచున్నది.

అనార్కాలి కెదురుగా మన్నదుమీఁక నక్బరుచక్రవర్తి ఠీవితోఁ గూర్చుండెను. అతని ప్రక్కనే యువరాజగు సలీము కూర్చుండెను. మెఱుపుతీగవలె నాబాలిక ముందుకు వచ్చి సారంగుతో శ్రుతి కలిపి పాడ నారంభించి యందియలు ఝణంఝణధ్వనులు సేయ కుడికాలు ముందుకుఁ జాపి నాట్యము మొదలుపెట్టెను. ఆమె ముఖారవింద మందఱకు నేత్రపర్వము చేయుచుండెను. ఆమె పాట వీనులకు విందుగా నుండెను. అభినయము మనోజ్ఞతరముగా నుండెను. సభాసదులు దానివిలాసములకు నత్యంతచాతుర్యమునకు జక్కఁదనమునకుఁ జొక్కి యానందపారవశ్యము నొందిరి. ఆనృత్యసమయమున ననార్కాలి తన్నుఁ దా మఱచి గానము చేసెననియు నభినయించెననియుఁ జెప్పుట యతిశయోక్తి కాదు. కొన్ని పాటలు పాడిపాడి కొట్టకొనకామె

"ద్వి. నీవె నే ననుమాట నిక్కంబు సుమ్ము!
నేనె నీవై యుందు నెచ్చెలికాఁడ!
మనకు భేదము లేదు మనసులయందు
నంగముల్ రెండయ్యు నాత్మ యేకంబె!"

యని యర్థమిచ్చుపాట పార్సీభాషలోఁ బాడెను. పాడునప్పుడు దానిచూడ్కులు సలీముపై నిలిచెను. సలీము నిరీక్షణంబులు దానిపై నెలకొనెను. అన్యోన్యముఖావలోకనముచేత వారిద్దరమితానందము నొందిరి. ఆయానందము వారు పట్టలేకపోయిరి. కొన్ని బాహ్యచిహ్నము లాయానందమును వెల్లడించెను. ఆపాటఁ బాడుచు ననార్కాలి మందహాసము చేసెను. సలీము దానికిఁ బ్రత్యుత్తరముగాఁ జిఱునవ్వు నవ్వెను. తనపాడినపాటయొక్క రసము రసజ్ఞుఁడైన తనమనోహరుఁడు గ్రహించి మందహాసము చేసెనని యాజవ్వని తెలిసికొని సంతోషించెను. ఆనందాతిశయమున దానిశరీరమునఁ బులకాంకురములు దోఁచెను. సలీము శరీరముగూడ నటువంటి వికారమునకే వశమయ్యెను. తన్మయావస్థలో నున్నయోగియు యోగినియు నెటులుందురో సలీమును, జవ్వనియగు ననార్కాలియు నటు లుండిరి. ఈస్థితి, సభాసదులు గ్రహించిరో లేదో కాని చక్రవర్తిమాత్రము గ్రహింపకపోలేదు. అనార్కాలి మందహాసము చేయుటయు, దానికి బదులుగా సలీము చిఱునవ్వు నవ్వుటయు నక్బరు కనిపెట్టెను. కనిపెట్టినతోడనే కాఱుచిచ్చువలె నతనికోపాగ్ని మండెను. పరమ

నీచురాలైనదాసీపుత్రి తనస్థితియుఁ దనకుమారుఁడైన సలీముస్థితియుఁ బరికింపక వానిం దన వలలో వేసికొనుటకుఁ బ్రయత్నము సేయుచున్నదని యతఁ డభిప్రాయపడెను. అది పాపాత్మురాలని యతఁడు దృఢముగా నమ్మెను. వెంటనే యతఁడు కొజ్జా నొకనిం బిలిచి యనార్కాళిని వ్రేలితోఁ జూపి "ఓరీ! ఈదురాత్మురాలిం దీసికొనిపోయి యీరాత్రి చీఁకటికొట్టులోఁ బారవేయుము. రేపు దయమునఁ బ్రతికియుండఁగానే శరీర మొలిచి దీనిం జంపుము. మాయలమారి నవ్వులు నవ్వి, దొంగచూపులు చూచి, పడుచువాండ్ర భ్రమపెట్టి పాడుచేయవలెనని యీపాపాత్మురాలు సంకల్పించుకొన్నది. ఇటువంటి పడుచుబానిసకూఁతునకు బుద్ధివచ్చునట్లు చేయించెద" నని కఠిన స్వరముతోఁ బలికెను. అప్పలుకులు విని సభాసదు లందఱు గడగడ వడంకిరి. సలీము కొయ్యబొమ్మవలె నిశ్చలుఁడై పోయెను. నృత్యము చేయుచున్న యనార్కాళి నృత్య మాపి నిలిచి చక్రవర్తి యెవ్వరి నుద్దేశించి యాపలుకులు పలికెనో యని తెలిసికొనఁ గోరి, యాతని వ్రేలు తననే చూపుటచేత నది తన్నుఁగూర్చియే యని తెలిసికొని భయముచే గడగడ వడంకెను. అంతట నొకకొజ్జా యామెమీఁదఁ జేయివైచి చేయిపట్టుకొని రమ్మని లాగెను. అనార్కాళి దుఃఖవశమునఁ బెద్దకేక వేసి విదలించుకొని వానిపట్టుఁ దప్పించుకొని చక్రవర్తి పాదములపైఁ బడెను. పడినపరువాత నామెకు స్మారకము లేదు.

మఱల స్పృహవచ్చునప్పటి కనార్కాళి దేదీప్యమానములగు దీపములనడుమఁ గాక చీఁకటికొట్టులో నుండెను. ఆమె మేనుమరచి పడియున్న కాలమునఁ జక్రవర్తి యాజ్ఞప్రకారము కొజ్జాలామెం దీసికొనిపోయి యంధకారబంధురమగు కారాగృహమునం బారవైచిరి. తెలివివచ్చిన తోడనే యామె తన దురవస్థం దెలిసికొని కడుగడు విలపించెను. "హా! దైవమా! హా! దైవమా! నాకుజరిగినగారామునకును నేఁబడినసుఖమునకును నా కీదురవస్థ దగునే? భూలోకమందలిచక్రవర్తు లందఱిలో శిఖామణియని చెప్పఁదగిన మొగలాయి పాదుషా యంతఃపురములో నున్నస్ఫటికశిలాసౌధములమీఁద నివసించుదానికి, నతని రాణివాసపు స్త్రీలచే మిక్కిలిగౌరవింపఁబడిన దానికి, నతని యుద్యానవనములో విహరించు దానికి, నతనికుమారునిహృదయ మపహరింపఁగలిగినంత సౌందర్యమునకు నిలయ మగు దానికి, నిటువంటిదురవస్థ ప్రాపింపఁ జేయుట నీకు న్యాయమా? నాకింత దుర్మరణమా? నరహంతకులకు, రాజద్రోహులకు, మతద్రోహులకుఁ జేయవలసినదారుణదండనము పుష్పసుకుమారనగు నాకు విధించుటకా చక్రవర్తిమనస్సొప్పెనో? ఆహా! రాజులహృదయము లొకప్పుడు వజ్రములకంటె నతికఠినములు గదా! రాజుల నమ్మినవారిగతి యెన్నఁటికి నింతియే! పూర్వక్షణ మనుగ్రహము, ఉత్తరక్షణము నిగ్రహము. ఆహా! బ్రతికియుండఁగా శరీర మొలిచి చంపుటయే! నారింజపం డొలిచినట్లు మృదుశరీరముగలయంగన నొలిచిచంపుటయే!

ఓ అల్లా! యీపాదుషాలహృదయములను రాతితోఁ జేసితివా? హా మహమ్మదు! రక్షించు. రక్షించు. ఇంతకుఁ నేఁ జేసినతప్పేమి? నే నెవరికి ద్రోహముఁ జేసితిని? నే నందకత్తియనగుట నాలోపమా? యువరాఁజగు సలీమునకు నాపై వలపుగలుగుట నాలోపమా? నృత్యగానములలో నే నసమాననై పాదుషాసభలో నున్న స్త్రీపురుషుల మనఃకోశముల నానందరసముతో నింపుట నాలోపమా? రాణివాసమందున్న రమణులకు నాపై దయగలుగుట నాలోపమా? నేను దన కుమారుని నావలలో వేసికొనుటకై ప్రయత్నముచేసితినా? నన్నే యతఁడు వలలో వేసికొనెను. నన్నే యతఁడు భ్రమపెట్టెను. నన్ను వెదకికొనుచుఁ దోఁటలోని కతఁడే ముందువచ్చెను గదా! చదువుకొన్నవాఁడు తండ్రి యనంతరమున గద్దెయెక్కి హిందూస్థానము నేలఁదగినవాఁడు— అటువంటి సలీమునకు మనోబలము లేకపోఁగా విద్యావిహీనురాలను, మనోదేహబలము లంతగా లేనిదానను, నేనా దోషారోపణకుఁ దగినదానను? చక్రవర్తిమాటయే శాసనము. అతనిమాట నెదిరించువా రెవరు? న్యాయముకాదని తెలుపువా రెవ్వరు? తెలిపిన వారికి నాగతియే పట్టును. చావు కొనితెచ్చుకొనువా రెవ్వరు? రాజుల హృదయములు వారికోలుపుకూటములవలెనే ధర్మశూన్యములు. వారికాగ్రహము కలిగినా యనపరాధుని బుట్టి మెగురును. అనుగ్రహము కలిగినా యపరాధి యందల మెక్కును. హా! తల్లీ! నీకుఁ గలిగినమరణము నాకేల గలుగదయ్యెను? ఇంతదారుణమృత్యువు కనిపెట్టుకొని యుండఁగాఁ జిన్నతనమున నే నేల చచ్చిపోదును" అని మఱియు నేమేమో యనుకొనుచుండఁగా నంతలోఁ దలుపు సందులలో నుండి యొకవెలుతురు కనఁబడెను. అడుగుల జాడ వినంబడెను. తలుపుగొళ్లె మూఁడఁదీసినట్లు చప్పుడయ్యెను. తలుపు తెరువఁబడెను. చెఱసాల కావలివాఁడగు రహీంఖాను కాఁగడా చేతఁబట్టుకొని నిలిచియుండెను. అతని ప్రక్క నొక్కవిలాసవంతుఁడు బిక్కమొగముఁ బెట్టుకొని నిలువంబడి యుండెను. అతని ముగముఁ జూడఁగానే యనార్కాలి లేచి నిలువంబడెను. ఆవిలాసవంతుఁడు గదిలోఁ బ్రవేశించి 'ప్రియురాలా'! యని యనార్కాలిని గాఁగిలించికొనెను. అనార్కాలి కన్నులనుండి బాష్పబిందువులు రాలెను. నాతండ్రిగారు నీవిషయమై యతికఠినుండై నీకు విధింపరాని దండన విధించెను. దీనికై నీవు విచారింపకుము. నీప్రాణము రక్షించుటకు మంచియుపాయ మున్నది. అటువంటిదారుణమరణము నీవంటికుసుమసుకుమారికిఁ దగదు. నీమనోవేదన విడువుము." అని సలీము పలికెను. "రాజకుమారా! భగవంతుఁడు ప్రత్యక్షమై వచ్చినను నాయపాయము తప్పదు. నేను గుండె రాయిచేసికొని యుంటిని. నాకు విచారమే లేదు. అంతఃపురమందలి దాసీజనములోఁ గొందఱు రాణులు కాఁగలరు. కొంద ఱకాలమృత్యువు నొందఁగలరు. నేను రెండవదానిలోఁ జేరినదానను. నాఘోరమరణము

దప్పింప మీతరముగాదు." అని యనార్కాలి బదులుచెప్పెను. "ప్రియురాలా! చక్రవర్తి విధించినదండనముఁ జక్రవర్తికుమారుఁడే త్రిప్పఁగలఁడు. నాతండ్రి ముసలివాఁడు. ఆఱునెలలకో, ఏఁడాదికో చావక మానఁడు. అప్పుడు నేను పట్టాభిషిక్తుఁడ నగుదును. అప్పుడు నీవు రాణివయ్యెదవు. ఈలోపుగా నిన్నుఁ దీసికొని నేను బాఱిపోయెదను. గుఱ్ఱము సిద్ధము చేసితిని. నావెంట రమ్ము! లే! త్వరపడు! ఆలస్యము చేయకు! తెల్లవారునప్పటికి మనము చక్రవర్తి కందకుండ కడుదూరము పోవుదము." అనిరాజకుమారుఁడు మరలఁ బలికెను. అనార్కాలి యిట్లనియె— "యువరాజా! మందభాగ్యురాలనగు నానిమిత్తము నీవు చక్రవర్తిని విడిచి, తల్లిని విడిచి, బంధువర్గమును విడిచి వచ్చుట న్యాయము కాదు. నేను దాసీపుత్రికను. చక్కఁదనముచేత నీయండను నేను నిలుచుటకుఁ దగియుంటిని గాని, స్థితినిబట్టి నీతో మాటలాడుటకైనఁ దగినదానను గాను. నన్నుఁ దీసికొని నీవు పారిపోయితివేని నీమీఁద నీతండ్రి కాగ్రహమువచ్చును. వచ్చెనా నీవు రాజ్యము కోల్పోవచ్చును. ప్రాణములు కోల్పోవచ్చును. యావజ్జీవము కారాగృహమునం దుండవలసిచ్చును. పడుచుఁ దనపువలపునకై యిటువంటి యిడుమలు పడఁదగదు. నీకుఁ హానిచేయుట కిష్టము లేదు. నీవెంట నేను రాను."

ఆపలుకులు విని సలీము, బాలికయుదారభావమునకు మిక్కిలి యక్కజము పడి యామెతో నిట్లనియె. "ప్రియురాలా! నావిషయమై నీవు భయపడకుము. నేను జక్రవర్తికుమారుఁడను గదా! నాపైఁ జక్రవర్తి కాగ్రహము గలిగినను నాకు భయము లేదు. పుత్రులనేకులు నాపక్షము రాఁగలరు. మాతండ్రిపై మనంబున ద్వేషముగలవారందఱు నాపక్షము చేరుదురు. నిరపరాధురాలైననీప్రాణము రక్షించుటకు నేనెట్టిశ్రమనైనఁ బడుదును. కావున నేమాటంకముం జెప్పక నావెంట రమ్ము. కాలము పరుగెత్తుచున్నది. రెండుజాములకంటె నెక్కువరాత్రియైనది. ప్రతినిమేషము మనకు విలువ గలది. నిముసము దాఁటిన కార్యము మిగిలిపోవును." అన నామె కొంచె మాలోచించి 'సరే' యని యొప్పుకొనెను. అప్పుడు రహింఖాను పనిమీఁద నావలకు వెళ్లినట్లు వెళ్లి తిరిగి వచ్చి "మహాప్రభూ! పాదుషాగారు వచ్చుచున్నా"రని చెప్పెను. ఆమాటవినఁగానె సలీముగుండెలు చెదరెను. అనార్కాలి తనకు మరణ మప్పుడే సంభవించునని భయంపడి వడఁకెను. సలీము నిమిషమాత్రము భయావస్థకు లోనై యుండి కొండొకతడవునకు ధైర్యము తెచ్చుకొని "ఏఁడీ! పాదుషా. ఇట్టి యర్ధరాత్రమున నతఁ డెప్పుడైన బయలు దేరునా?" యని యడిగెను. అతనికి రహింఖానుఁ డిట్లనియె. "మహాప్రభూ! గులాములు తమతమకార్యములయందు శ్రద్ధకలిగి మెలఁగుచున్నారో, లేదో చూచుటకై యప్పుడప్పుడు పాదుషా యర్ధరాత్రమున సైతము బైలుదేరి వచ్చుచుండును. ఇది క్రొత్తగాదు. ఆప్రక్కనుండి వచ్చుచున్నారు. చప్పున మీరావలికి వెళ్లుఁడు. ఈగది తాళము వేయవలెను."

అనార్కలి

" ......అందియలు ఝుంఝుణ ధ్వనులు సేయ
కుడికాలు ముందుకుఁ జాఁచి నాట్యము మొదలుపెట్టెను. "

అనవుడు సలీము “నే నీగదిలో నుండెదను. మమ్మిద్దఱ నిందుఁ బెట్టి తాళము వేసికో! తాళము సరిగానుండుటఁ జూచి పాదుషా వెళ్లిపోఁగలఁడు.” అని పలికెను. అనవుడు రహీంఖాను, “స్వామీ! ప్రభువుల చిత్తవృత్తులు తెలిసికొనుట కష్టము. తాళము భద్రముగా నున్నదని పాదుషా సంతుష్టుఁడై వెడలిపో వచ్చును. లేదా తానువిధించిన మరణదండనను గూర్చి యెట్లువిలపించుచున్నదో తెలిసికొనుటకై తాళముఁదీయించి యాత[illegible]ఁజూడ వచ్చును. అట్లుగాకున్న నతని కేదైన ననుమానము గలిగి తాళముఁ దీయించవచ్చును. అందుచేత మీరాగదిలో నుండుట మీకును నాకును క్షేమము గాదు. కావున వేఱొక చోటికి దేవరవారు వేంచేయవలయు” నని మనవిచేసెను. సలీము చిన్నమొగము చేసికొని సమీపమున నున్నయొక మేడమీఁదికిఁ బోయెను. పోయి రహీంఖానునిఁ జూచి “పాదుషా వెళ్లిపోయిన తోడనే నన్నుఁ బిలువు” మని యాజ్ఞాపించెను. “చిత్తము స్వామీ!” యని యతఁ డిట్టటు దిరిగి మరలివచ్చి “స్వామీ! యింకను పాదుషా వెళ్లలేదు. దేవరవారి కేమియుఁ దోఁచుట లేదు కాఁబోలు. దాహము కావలెనా?” యని యడిగెను. “కొంచెము ద్రాక్షసారాయము దీసికొనిరా” యని సలీము పలికెను. అతఁడు వెంటనే వెళ్లి ద్రాక్షసారాయి యొకగిన్నెలోఁ బోసి తన రొండినున్న యొక డబ్బామూఁతఁ దెఱచి యందున్న పొడుము కొంచెమందులోఁ గలిపి “తెల్లవారులోపుగా నీకు మరల మెలకువ రాదులే” యని తనమనసులో ననుకొని యాగిన్నె నాతనిచేతి కిచ్చెను. అతఁ డది త్రాగి “శహబాసు! రే రహీం! శహబాస్!” యని మెచ్చి మరల నొకగిన్నె తెమ్మని త్రావి మత్తుచేతఁ గన్నులు మూసికొని పండుకొనెను. రహీంఖాను సలీము గదివిడిచి పోఁగానే యనార్కలినొకతెనే యందులోఁ బెట్టి మరలఁ దాళము వేసెను. అనార్కలిం దీసికొని సలీము పాఱిపోయినపక్షమున రహీంఖానునకు దారుణమైన దండన విధింపఁబడును. కారాగృహమున కధికారియతఁడు. గదితాళము లతనియొద్ద నుండును. అతనికిఁ దెలియకుండ ననార్కలి చెఱనుండి తప్పించుకొనుటకు వీలులేదు. ఆమె పాఱిపోయిన యెడల నితఁడు దాని కంగీకరించెనని చక్రవర్తి నిశ్చయింపకపోఁడు. నిశ్చయించెనా తలనఱకించియో, యొడలొలిపించియో, యేనుఁగు కాళ్లక్రింద వేయించి త్రొక్కించియో, కాఁగిన నూనె కొప్పెరలోఁ బడవేయించియో, త్రాఁచుపాముల చేతఁ గరపించియో, కఱ్ఱలతోఁ గొట్టించియో, పెద్దపులిబోనులోఁ బడవేయించియో, పాదుషా యతనిని జంపింపకపోఁడు. అందుచేత రహింఖానుఁడు సలీము చేయఁదలచిన ప్రయత్నము తనకుఁ బ్రాణభంగకరమని తలఁచి పాదుషా రాకపోయినను వచ్చుచున్నాఁడని యబద్ధమాడి సలీమును గదిలోనుండి వేఱొకచోటికిఁ బంపివేసి యతఁడు త్రాగుబోతగుటచేత దాహమగుచున్నదా యని వంకఁబెట్టి యతనికి సారాయముమాట జ్ఞాపకము చేసి యతఁడు ద్రాక్షసారాయము తెమ్మన్నప్పుడు మరలఁ ద్వరలో మెలఁకువ రాకుండ

నట్లు దానిలో మత్తుమందుఁ గలిపి యిచ్చెను. అతనికోరిక నెఱవేఱెను. తెల్లవారువఱకు మరల సలీమునకు మెలఁకువ రాలేదు. రహీంఖానుని యాపద తప్పెను. త్రాగుబోతులచేత గడుసువాండ్రు తాము తలఁచినపని చేయింపఁ గలుగుదురు కదా!

అనార్కాలి మరల గదిలో నొంటిగఁ గూర్చుండి పాదుషా వెళ్లిపోయినతోడనే సలీము వచ్చి తన్నుఁ దీసికొనిపోవుననియుఁ దనకు ఘోరమృత్యువు [illegible] నెంతో యాసగలిగి యతనిరాకకు నిరీక్షించుచుండెను. ఆమెకు నిముస మొక జాముగాఁ దోఁచెను. ఏచప్పుడైనను మరల సలీము తన కడకు వచ్చుచున్నాఁడని తలుపుదగ్గఱకుఁ బోయి యాధ్వని నామె యాలకించుచుండెను. కాని యెంతసేపటికిని సలీము రాలేదు. ఆమె ప్రాణము విసికి పోయెను. విరక్తి దోఁచెను. అపుడామె యిట్లు చింతించెను. "మొదట, నేను రాజకుమారునితో వెళ్లుట కిష్టపడక పోతిని. అతఁడెంతో బలవంతపెట్టి తన వెంట వచ్చుటకు నన్నొడంబరచెను. అంతలో నాయదృష్టహీనతచేత పాదుషా వచ్చుచున్నాఁడని తెలిసెను. పాదుషా వచ్చుటగూడ నాభాగ్యలోపమే. అర్ధరాత్రిసమయమున నంతఃపురములో నిద్రాసక్తుఁడై యుండు పాదుషా నేఁటిరాత్రియే చెఱసాలఁజూచుటకు బయలుదేఱవలసిన యవసర మేమున్నది. బంధమోక్షముఁ జేసి సలీము నన్ను వెంటఁగొని పోవు నన్నవార్త యంతఃపురమునఁ బొక్కియుండునా? గంభీరస్వభావుఁడైన రాజకుమారుని మనఃపేటిక భేదించుకొని యావార్త యెట్లు వెల్లడి కాఁగలదు? అట్లనఁగూడదు. ఏమో? యెవ్వరెఱుంగుదురు? ఆంతరంగికమిత్రున కెవ్వనికైన నతఁడీమనోరథమును జెప్పఁగూడదా? ఆమిత్రుఁడు మఱియొకనితో ననఁగూడదా? క్రమక్రమముగ నది పొక్కఁగూడదా? అదియును గాక రాజకుమారులే సహజముగ నవ్యవస్థచిత్తులు. అందులో సలీము త్రాగుబోతు. సామాన్యుఁడైన త్రాగుబోతుకూడఁ గాఁ[illegible]పానమున నీతియు మేఱయు నెఱుఁగనివాఁడు. త్రాగియున్న సమయమున నతనినోటనుండి యీమాట యప్రయత్నముగ జారియుండివచ్చు. ఆమాట నాయందసూయ గలబానిసలచెవిని బడియుండవచ్చు. 'దొరికినదే సందుగదా' యని వారు పరమసంతోషముతోఁ బాదుషా కెఱిఁగించి యుండవచ్చు. అట్లు కానియెడల సలీము నామనస్సు శోధించుటకై నాకడకు వచ్చియుండి నేను మెత్తఁబడఁగానే యిది కక్కుర్తిమానిసియని నావిషయమై నీచాభిప్రాయము పడి నన్నుఁ బరిత్యజించి యుండునా? రాజులచిత్తములు స్థిరములు కావు. నాచెట్టఁబట్టినపక్షమునఁ దన కెన్నో యపాయములు సంభవించునని పశ్చాద్విచారమున నాకడ కతఁడు వచ్చుట మానియుండునా? లేక నక్కజిత్తులవంటి మాయోపాయములయందు మిక్కిలికుశలుఁడగు రహీముఖానుఁడేదేని పన్నుగడఁ బన్ని సలీముమనసు విఱిచియుండునా? ఏమైన నేమి? ఇఁక నతఁడు రాఁడు. అదిగో జాముకోడి కూయుచున్నది. తెల్లవారవచ్చుచున్నది. తెల్లవారఁగానే నాబ్రతుకు

తెల్లవారును. మరణమునకు నేను జడియను. ప్రాణము విడుచుట నాకు సులభసాధ్యము. కాని కిచ్చిలిపండొలిచినట్లు మేనితోలొలిచి పాదుషా చంపఁదలఁచుచున్నాఁడు. మానిసికంత కంటె ఘోరమృత్యువు లేదు. అది తలఁచుకొనఁగానే నామేను జల్లుమనుచున్నది. అహాహా! స్త్రీయనియైన పాదుషా యాలోచింపలేదుకదా! చంపఁదలఁచుకొన్నపుడు రాజులకు స్త్రీ లేమిటి? పిల్లలేమిటి? పెద్దలేమిటి? పడుచువాండ్ర శృంగారభావములు చూచి సహింపక ఘోరదండన విధించిన చక్రవర్తి యితఁడు తప్పఁ బ్రపంచమున మఱియొకఁడుండఁడు. తనపడుచుఁదనమునఁ దానెందఱు సుందరులఁ జూచి మందహాసముఁ జేసెనో, యెందఱిం జేతులు పట్టిలాగెనో, యెందఱికిఁ గనుసన్నలు చేసెనో, యెందఱిని వారికిష్టము లేకయ కౌఁగిలించికొనెనో, యెందఱికి దూతికలచేత వార్తలంపెనో, యెందఱికి జాబులు వ్రాసెనో, యెందఱినిమిత్తమై యెక్కరానిచోట్లెక్కి దిగరానిచోట్ల దిగి పడరాని బాములం బడియెనో, యొక్కసారి యితఁడు స్మృతికిఁ దెచ్చుకొన్న బాగుండును. ఆమాటలడుగఁ గలవాఁ డెవ్వఁడు? పాదుషా! ఢిల్లీ పాదుషా! మొగలాయి పాదుషా! బుఱ్ఱలు దీయించు పాదుషా! శరీరము లొలిపించుపాదుషా! ఇంక నీవిచార మెందుకు? అతఁడు చేయఁదలఁచిన పని నేనే చేసికొనియెద. మాయమ్మ యిచ్చిన యుంగర మున్నది. ఉంగరములో వజ్రమున్నది. వజ్రములో మృత్యువున్నది. మృత్యువులో సుఖమున్నది. కొజ్జాలు నన్ను స్పృశించి చర్మ మొలువ నక్కఱలేకయే ప్రాణము విడువవచ్చును." అనియుంగరములోని వజ్రము నూడఁగొట్టి మ్రింగెను. మ్రింగినతరువాత నేమైనదో వేఱ చెప్పనక్కఱలేదు. సలీమునకు మఱునాఁడునైతము సరిగ మెలఁకువ రాలేదు. వచ్చినతరువాత నతఁ డనార్కలియని పిలిచి యెవ్వరి నడుగలేదు. మఱచియుండునా? మఱచియుండవచ్చు. రాజుల కెదుటనున్నదే పెండ్లికూఁతురు గదా! ఎదుట లేకపోయిన విషయము వారికి మనసులోఁ గూడ నుండదు. ఒకవేళఁ దనకు మెలఁకువ వచ్చునప్పటికే పాదుషా యనార్కలిని ఘోరమృత్యువుపాలు చేసి యుండునని తెలిసికొని యతఁ డామెపై రోత్తపోయి యుండవచ్చును. అనంతరము కొంతకాలమున కక్బరుచక్రవర్తి మృతినొందెను. సలీము హిందూస్థానమునకుఁ బాదుషాయై జహాంగీరను బిరుదువహించెను. ఒకపర్యాయ మతఁడు లాహోరుపట్టణములో నొకతోఁటలో నిట్టటువిహారము సేయుచుండ, నొక మట్టిదిబ్బ కనఁబడెను. ఇది యేమిటని యతఁ డొక కొజ్జావాని నడిగెను. అతఁడిట్లనియె- "మహాప్రభూ! నాయనగారు జీవించియున్నపుడు మనయంతఃపురమున ననార్కలియని యొకపిల్ల యుండెను. ఆపిల్ల చనిపోయెను. ఇది దానిసమాధి" ఆమాటలు వినఁగానే జహాంగీరునకు మనోవైకల్యము గలిగెను. అతఁడు రెప్పవాల్పక యాసమాధివంకఁ జూచెను. అప్పుడు రెండుబాష్పబిందువులు రెప్పలనుండి జారెను. ఆతోఁటలో నే యామె నిలిచి యున్నపుడు వెనుకపాటునఁ దానుబోయి యామెను

మొదటిసారి కౌఁగిలించుకొనుటయుఁ, దరువాత రెండుమూఁడుసారు లామె నచ్చటఁ గలిసికొనుటయు, నామె జగన్మోహనముగఁ దనతండ్రి చదురులో నృత్యముసేయుటయు, నాసమయమునఁ దమకిరువురకు శృంగారభావ ముదయించుటయుఁ, దనమూలమున నామెకుఁ దన తండ్రి దారుణదండన విధించుటయుఁ దా నామె యున్న చెఱసాలకుఁబోయి యామెను రక్షించుటకు వాగ్దానము చేసి త్రాగిపడియుండి రక్షింపలేక పోవుటయు నతని మనస్సునకు జ్ఞప్తికి వచ్చెను. వచ్చినతోడనే మనోవీథిని విషాద మేఘములు గ్రమ్మెను. ఖించినదానికి విచారించినఁ గార్యము లేదని పట్టపురాణి గావలసిన యనార్కాళి దిక్కుమాలినచావుఁ జచ్చి యూరుపేరులేక నశించుట యామె సౌందర్యమున కనర్హమని తలంచి యాపేరు శాశ్వతముగ హిందూస్థానమున నిలుప సంకల్పించి యాసమాధిపై మంచిగోరీ కట్టించి యాతోఁటకు నాఁటనుండి యనార్కాళియని పేరు పెట్టెను. కాలక్రమమున నక్కడ తోఁట నశించి పేఁట బయలుదేరెను. ఆపేఁట కిప్పు 'డనార్కాళి' యనిపేరు. ఇది లాహోరుపట్టణమున సుప్రసిద్ధమై యున్నది.

కనుబొమ్మ

నండూరి వెంకటసుబ్బారావుగారు బి. ఏ.

నన్నుతలుసుకు మెంకి - కన్ను మూయాలి,
కనుబొమ్మ సూడాలి - కరిగిపోవాలి.
నన్ను కలలో సూసి - నవ్వ కోవాలి,
కనుబొమ్మ సూడాలి - కరుపు తీరాలి

నిదరలో సిగపూలు - సదరు కోవాలి,
కనుబొమ్మ సూడాలి - కమ్మ గుండాలి.
పిలుపేదో యినగానె - తెలివి రావాలి,
కనుబొమ్మ సూడాలి - కతలు సూడాలి.